క్లుప్తంగా

పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ

శిరివెళ్ల: మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామం గోవిందపల్లెలో మంగళవారం పోలీస్ బందోబస్తు మధ్య యూరియా పంపిణీ జరిగింది. రైతు సేవా కేంద్రం గోడౌన్‌లో ఉన్న 400 బస్తాలను ఒకొక్క రైతుకు 2 బస్తాల చొప్పున 200 మందికి పంపిణీ చేశారు. ప్రస్తుతం వరి నాట్లు పూర్తయ్యాయి. మొక్క పెరుగుదల కోసం రైతులు యూరియాను వాడుతారు. రైతు సేవా కేంద్రాల ద్వారా గత వారం రోజులుగా వ్యవసాయ శాఖ అధికారులు యూరియా పంపిణీ చేస్తున్నారు. మరో పక్క పోలీస్‌లు కూడా దుకాణాలలో దాడులు చేస్తున్నారు. నిల్వలు, పంపిణీ రికార్డులను సరి చూస్తున్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

దొర్నిపాడు: పంటల సాగులో మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించరాదని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. ఆమె మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని కొండాపురం, దొర్నిపాడు గ్రామాల్లో నిర్వహించారు. రైతులకు సమగ్ర యాజమాన్యం, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం పెరగడం వల్లనే పంటల సాగుకు పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు. వీఏఏ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో చేప పిల్లల విడుదల



మేడ వారి బావిలో చేప పిల్లలను వదులుతున్న వైద్య సిబ్బంది

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం బావుల్లో గంబూషియా చేప పిల్లలను వదిలారు. వైద్యాధికారిణి శ్రావణి మాట్లాడుతూ.. ఈ చేప పిల్లలు లార్వాలను తిని దోమలు పెరగకుండా నియంత్రిస్తాయని తద్వారా మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగ్యూ, మెదడు వాపు వంటి వ్యాధులు సోకుండా అరికట్టవచ్చన్నారు. ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రనాథ్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

చాగలమర్రి: మండలంలోని గోట్లూరు గ్రామంలోని నీటి కుంటలో వైద్యారోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో గంబూషియా చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ మలేరియా సబ్ యూనిట్ అధికారి శివ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. దోమల నివారణకు నీటి కుంటల్లో 300 గంబూషియా చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు.

బస్‌షెల్టర్‌ను తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): హోలీక్రాస్ గర్ల్స్ హైస్కూల్ గేటు పక్కన నిర్మించిన బస్‌స్టాప్ షెల్టర్‌ను వెంటనే తొలగించాలని రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, గిరిజన విద్యార్థి సమాఖ్య నాయకులు రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హోలీక్రాస్ గర్ల్స్ హైస్కూల్ ఎదుట నిర్మించిన బస్‌స్టాప్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు బస్‌స్టాప్‌ను మరోచోటికి మార్పు చేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామన్నారు. విద్యార్థి సంఘం నాయకులు రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ

నంద్యాల (వ్యవసాయం): సేవా స్ఫూర్తి ప్రదాత మదర్ థెరిసా జయంతి సందర్భంగా మంగళవారం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పోసిన సుబ్బారావు సహకారంతో పేద దివ్యాంగులకు వినాయక చవితి పండుగకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, క్లబ్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



పనులను పరిశీలిస్తున్న పీడీ సూర్యనారాయణ

నంద్యాల(అర్బన్): ఉద్యానవన శాఖ అదించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, హార్టికల్చర్ ఆధ్వర్యంలో నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె, పాండురంగాపురం గ్రామాల్లో చేపడుతున్న పనులను పీడీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితిలో పండ్ల తోటలు, ఉద్యాన పంటలను కాపాడుకోవడానికి వ్యక్తిగత నీటి కుంటల నిర్మాణాలను రాయితీతో చేపట్టవచ్చన్నారు. ఏపీఓ గణేష్, ఈసీలు అశోక్, టీఏ సుబ్బరాయుడు, ఫకృద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ జాన్సన్, రైతులు పాల్గొన్నారు.



క్రేన్ సాయంతో విగ్రహాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం



విగ్రహాన్ని ఉత్సాహంగా తీసుకెళ్తున్న యువకులు



విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న యువకులు

వి‘నాయకుడి’ ఆగమనం

- వాడవాడలా కొలువుదీరనున్న గణనాథులు
- నంద్యాల జిల్లాలో 1200కుపైగా విగ్రహాల ఏర్పాటు
- వేడుకలకు సిద్ధమైన ఉత్సవ కమిటీలు

నంద్యాల(వ్యవసాయం): బుధవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పలు కూడళ్లు, వీధులు, గృహాల్లో ఉత్సవాలను నిర్వహించుకోవడానికి భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వినాయక విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. జిల్లాలో సుమారు 1200 విగ్రహాలను ప్రతిష్టించేందుకు మండపాలకు రూ.10 కోట్ల మేర ఖర్చవుతుందని గణేష్ కేంద్ర మహోత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఇందుకు అన్ని వర్గాల ప్రజలు విరాళాలు అందించి సహకరించారు. బుధవారం విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. తర్వాత సాంప్రదాయబద్ధంగా పూజలు చేశాక పల్లెల్లో 3వ రోజు, పట్టణంలో 5వ రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీ. సంజీవనగర్ రామాలయంలో కదలిపూర్ణ ఫల మహాగణపతి, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో సముద్రపు గవ్వలచే శ్రీవిశ్వ మహాగణపతి, పప్పులబట్టి బజార్‌లో అతిపెద్ద విఘ్న వినాయకుడు కొలువుదీరనున్నారు. పండుగ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచే టెక్కె మార్కెట్ యార్డులో జిల్లెడు, శీతాఫలం, ఎలక్కాయ, తంగెడాకులు, ఉత్తరేణి, గరిక, అరిటాకు, మొక్కజొన్న కంకులు, తదితర 21 రకాల ఫలాలు, ఆకులు పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.



మట్టి వినాయక ప్రతిమల విక్రయం



టెక్కె మార్కెట్ యార్డులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

స్థానికంగానే విగ్రహాల తయారీ

పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణ మండపంలో టంగుటూరు గ్రామం నుంచి విగ్రహాలు తయారు చేసే కళాకారులను పిలిపించి 3 నుంచి 4 అడుగుల మట్టి విగ్రహాలను తయారు చేసి వాటర్ కలర్స్‌తో మెరుగులు దిద్ది అమ్మకాలు జరుపుతున్నారు. పట్టణంలో 50కి పైగా ఎకో గణనాథులను తయారు చేసి అమ్మకాలు జరిపారు.

జోరుగా విగ్రహాల విక్రయం

పట్టణంలోని పద్మావతినగర్‌లో వ్యాపారులు గణేష్ ఉత్సవ విగ్రహాల స్టాల్‌లను ఏర్పాటు చేశారు. కొందరు వ్యాపారులు హైదరాబాదు, బెంగుళూరు, విజయవాడ నుంచి విగ్రహాలను తీసుకొచ్చి విక్రయిస్తుండగా మరికొందరు కేవలం గణేష్ ప్రతిమలను తీసుకొచ్చి, రంగులు వేసి విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. పలు ప్రత్యేకతలతో విగ్రహాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. విగ్రహాలను బుకింగ్ చేసుకున్న ఉత్సవ నిర్వాహకులు ట్రాక్టర్లలో తీసుకెళ్తున్నారు.

అధిక సంఖ్యలో మండపాల ఏర్పాటు



నంద్యాల పట్టణంలో 800కిపైగా వినాయక విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను పూజించేందుకు పలు చోట్లు ఏర్పాట్లు చేశారు. మండపాల వద్ద వేద మంత్రాలు, భక్తి పాటలతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. నిబంధనలు పాటిస్తూ వేడుకలను విజయవంతం చేయాలి.

–నెరవాటి అమర్‌నాథ్, గణేష్ కేంద్ర మహోత్సవ సమితి కార్యదర్శి, నంద్యాల

పత్తిలో కాయకుళ్లు తెగులు



పత్తి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఉమ్మడి జిల్లాలో సాగైన పత్తి పంటకు కాయకుళ్లు తెగులు సోకినట్లు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ పత్తి కీటక శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ఓర్వకల్లు మండలంలో సాగైన పత్తి పంటను ఆయన మంగళవారం పలువురు శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. మే మాసంలో ఉమ్మడి జిల్లాలో విత్తిన పత్తి కాయ పరిపక్వ దశలో ఉందన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, మబ్బులతో కూడిన వాతావరణం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండటం వల్ల కాయకుళ్లు తెగులు అక్కడక్కడ సోకిందన్నారు. కాయకుళ్లు ముఖ్యంగా బాహ్య, అంతర్ కుళ్లుగా ఏర్పడి పంట దిగుబడి, నాణ్యతను దెబ్బ తీసే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు మ్యాంకోజెబ్, కార్బండిజం మందు 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. బాహ్య, అంతర్‌కుళ్లు నివారణకు ముందస్తుగా కాపర్ యాక్సిక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టో సైక్లిన్ ఒక గ్రాము పది లీటర్ల నీటిలో కలుపుకొని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. కాయ మొగ్గ రాలుట నివారణకు బోరాక్స్ 300 గ్రాములు ఒక ఎకరాకు విత్తిన 90, 110 రోజులకు పిచికారీ చేయాలన్నారు. ప్లానోఫిక్స్ అనే మందును ఒక మి.లీ 5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లను నివారించవచ్చన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో పోస్టులను భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్కమ్ సంస్థల్లో 30 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. తక్కువ వేతనాలతో ఎక్కువ పనిగంటలు చేస్తూ ఎలాంటి భద్రత లేకున్నా విద్యుత్ ఉత్పత్తి వితరణ సంస్థలను నడిపిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు సంస్థకు వెన్నముఖగా ఉండి పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను బయటి అభ్యర్థులతో భర్తీ చేయాలనడం అన్యాయమన్నారు. కార్మికుల సేవలను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ట్రాన్స్‌కోలో డిప్లొమా పూర్తి చేసిన కాంట్రాక్ట్ కార్మికులు, జూనియర్ ఇంజినీర్ పోస్టులు కేటాయించాలని, వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలని కోరారు. దివ్యాంగ అభ్యర్థులకు రేషియో ప్రకారం ప్రత్యేకంగా పోస్టులు కేటాయించి భర్తీ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను సీనియారిటీ ఆధారంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

యూరియా నిల్వల తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలో యూరియా నిల్వలపై రెవెన్యూ, పోలీసులు, వ్యవసాయాధికారులు తనిఖీలు చేపట్టారు. ఆర్‌డీఓ విశ్వనాథ్, తాలూకా సీఐ ఈశ్వరయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాయిరాం గోడౌన్, మురళీకృష్ణ ఫెర్టిలైజర్స్,లక్ష్మీ వెంకటేశ్వర, పద్మావతి ట్రేడర్స్‌లో యూరియా, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఆర్‌డీఓ విశ్వనాథ్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

దొర్నిపాడు: రసాయన ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభద్ర హెచ్చరించారు. ఆమె మంగళవారం దొర్నిపాడులోని ఎరువుల దుకాణాలను ఎస్ఐ రామిరెడ్డి, ఏఓ ప్రమీలతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల లభ్యత, అలాగే ఈపాస్ మిషన్లను పరిశీలించారు. ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఉయ్యాలవాడ: మండంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ సువర్ణాదేవి తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎవరైనా ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాయలూరులోని శ్రీవీరభద్ర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో 11.52 మెట్రిక్ టన్నుల యూరియాకు సంబంధించి వివరాలు సరిగ్గా లేకపోవడంతో అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఏఓ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తం

సరిపడా యూరియా మాత్రమే తీసుకోవాలి

నంద్యాల: యూరియా కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో రైతులు అధిక మోతాదులో యూరియా కొనుగోలు చేయవద్దని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో యూరియా కొరతపై జిల్లా కలెక్టర్‌తో బీసీ జనార్ధన్‌రెడ్డి చర్చించారు. బీసీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని, సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.

మహిళ అదృశ్యం



లక్ష్మీదేవి (ఫైల్)

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి (39) అదృశ్యమైనట్లు ఎస్ఐ రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 26న వ్యక్తిగత కారణాల వల్ల ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, సన్నిహితుల వద్ద విచారించిన ఆచూకీ లభించలేదు. భర్త కాశీవిశ్వనాథ్ ఆచారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 91211 01166, 91211 01176 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తెలుగు గంగలో వ్యక్తి గల్లంతు?



షరీఫ్ (ఫైల్)

ఆళ్లగడ్డ: అహోబిలం సమీపంలో తెలుగుగంగ కాలువలో పడి షరీఫ్ (35) గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. షరీఫ్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం కొంతసేపు తెలుగుగంగ కాలువ గట్టుపై కూర్చుంటానని చెప్పి కుటుంబ సభ్యుల సహాయంతో అక్కడికి చేరుకొని కాలువ గట్టుపై కూర్చున్నాడు. కొంత సేపటి తర్వాత వారి ఇంటికి వెళదామని పిలవగా మీరు వెళ్లిరండి నేను మరికొంత సేపు ఇక్కడే ఉంటానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. తర్వాత వచ్చి చూడగా షరీఫ్ కనిపించలేదు. చేతి కర్ర అక్కడే పడి ఉంది. దీంతో షరీఫ్ జీవితంపై విరక్తి చెంది కాలువలో దూకాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కాలువ వెంట గాలింపు చేపట్టారు.

యాచకులకు అన్నదానం

నంద్యాల(న్యూటౌన్): మదర్ థెరిసా జయంతి సందర్భంగా భాను స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవికాంత్‌బాబు మంగళవారం పట్టణంలోని యాచకులకు అన్నదానం చేశారు. దేవగట్టు మహబూబ్‌బాషా, సత్తిబాబు, అఖిల్‌హేమంత్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి బీమా మంజూరు



హోంగార్డు కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల: ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన మాలిక్‌బాషా కుటుంబానికి రూ.38 లక్షల చెక్కును ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ – దొర్నిపాడు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మాలిక్‌బాషా మృతి చెందాడన్నారు. ఆ కుటుంబానికి పోలీసు శాలరీ ప్యాకేజీ కింద రూ.30 లక్షల ప్రమాద బీమా నగదుతో పాటు మృతుడి కూతురు మైనర్ కావడంతో రూ.8 లక్షలు బీమా లభించిందన్నారు. హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, యాక్సిస్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సూచించారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సుమారు 100 మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సహజ సిద్ధమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించడం, నిమజ్జనం చేయడం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, రంగులు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. పట్టణ సీఐ యుగంధర్, ఎస్ఐలు నగీన, జయప్ప ఉన్నారు

ఆత్మరక్షణ క్రీడల్లో రాణించాలి

స్థానిక ప్రజ్ఞా కళాశాలలో బాలికలకు రెండు రోజులుగా నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ.. బాలికలు ఆత్మరక్షణ క్రీడల్లో రాణించాలన్నారు. తద్వారా ఆపద సమయంలో ఉపయోగపడుతుందని, ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. సీఐలు గౌతమి, యుగంధర్ ఉన్నారు


యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

నంద్యాల(అర్బన్): రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల భరత్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నంద్యాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టులో వర్షాలు కురిశాయని, యూరియా వేస్తే పంటలు కోలుకొనే అవకాశం ఉందన్నారు. ఆలస్యంగా యూరియా వేస్తే ఉపయోగం ఉండదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా యూరియా కొరత రైతులను వేధిస్తోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించే మాఫియాలు ఎక్కువయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసి వ్యవసాయం దండగ అనే పరిస్థితి తెచ్చిందని దుయ్యబట్టారు. వచ్చిన అరకొర యూరియా టీడీపీ నేతల ఇళ్ల వద్దకు చేరుతోందని విమర్శించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం యూరియాను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీటీఎఫ్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీటీఎఫ్ నంద్యాల అర్బన్ కమిటీని స్థానిక కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రామచంద్రారెడ్డి, దస్తగిరి బాషాలు మంగళవారం తెలిపారు. నంద్యాల అర్బన్ కమిటీ అధ్యక్షుడిగా గాలయ్య, ప్రధాన కార్యదర్శిగా జానీబాషా, ఉపాధ్యక్షుడిగా జమాల్‌వలీ, రాంబాలాజీ నాయక్, రిజ్వానాకౌస్, ఓబులేసు, కార్యదర్శులుగా సరోజమ్మ, రమణ, ఫయాజ్, శ్రీనివాసులు, శంకర్‌నాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నౌమాన్‌బాషా, దస్తగిరిబాషా, వసంతకుమారి, అనీఫ్, రాములమ్మ, పరీన్‌భానులను ఎన్నికై నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జీపీఎఫ్ సమస్యలను కమిషనర్ పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ ముందుండి పోరాడాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ నంద్యాల అర్బన్ కమిటీ ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి

దొర్నిపాడు: వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆళ్లగడ్డ సీఐ మురళీధర్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను పారంభించిందన్నారు. తద్వారా వినాయక ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు పొందవచ్చన్నారు. అనంతరం పోలీసులు మండప స్థలాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే అనుమతులు ఇస్తారన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని అందజేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాలకు మాత్రమే అనుమతులు ఉంటాయన్నారు. ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. ఎస్ఐ రామిరెడ్డి ఉన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



మాట్లాడుతున్న ఏడీఏ సరళమ్మ,



మందలూరులో రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

చాగలమర్రి: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, డి.కొత్తపల్లె గ్రామాల్లో వ్యవసాయ శాఖ, యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆదినారాయణ మాట్లాడుతూ.. ఉల్లి పంటలో పురుగు, పోడు తెగులు, చుట్ట తెగులు నివారణకు పాటించాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త రవి మాట్లాడుతూ.. వివిధ పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను వివరించారు. సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య రైతులకు పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో ఆర్‌కేవీవై పథకం కింద మందలూరులో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న సహాయ సంచాలకులు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మినుము, మొక్కజొన్న వంటి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరిలో కలుపు యాజమాన్యంపై వివరించారు. అలాగే డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఏఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈఓలు రాజు, ఫహిమా, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీ



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ న్యామతుల్లా, హెచ్‌ఎం.జీవయ్య

చాగలమర్రి: ఈ నెల 29న క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను ప్రధానోపాధ్యాయులు జీవయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సయ్యద్ న్యామతుల్లా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఏటా ఆగస్టు 29న ప్రముఖ భారత హాకీ క్రీడాకారుడు దివంగత ధ్యాన్‌చంద్ పుట్టిన రోజున క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయుల జట్ల మధ్య నిర్వహించిన పోటీల్లో విద్యార్థుల జట్టు గెలుపొందింది. వీరికి క్రీడా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పీడీ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం ఐడీకే శాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రమేష్

చాగలమర్రి: నంద్యాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రమేష్ సుమారు 251 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 18 మందికి కంటి అద్దాలకు సిఫారసు చేయగా మరో 6 మంది విద్యార్థినులకు నంద్యాలలోని కంటి వైద్యశాలలకు సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులకు మెరుగైన కంటి చూపునకు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని, విటమిన్ ఏ అధికంగా లభించే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఎస్ఓ స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సమత, తదితరులు పాల్గొన్నారు.